

ఘనంగా ఎంబీయూ వార్షికోత్సవం

మోహన్‌బాబు యూనివర్సిటీలో బుధవారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. - 8లో



తవ్వేస్తూ.. తరలిస్తూ!

తిరుపతి రూరల్ మండలం పరిధిలోని స్వర్ణముఖి నదిలో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వేస్తున్నారు. - 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
తిరుపతి	6-27	4-57
గూడూరు	6-21	4-53

న్యూస్‌రీల్

పర్యాటక అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : పర్యాటక రంగం అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో టూరిజం, ఫారెస్ట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో తిరుపతి జూపార్క్, కల్యాణి డ్యామ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధానంగా పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులను ఆకట్టుకునేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆ దిశగా హస్త కళాకారులు, చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలని చెప్పారు. ఎకో టూరిజం ప్రమోషన్ కోసం హబ్ అండ్ స్పోక్స్ మోడల్ పద్ధతిలో హ్యాండీక్రాఫ్ట్స్ మెన్ తదితరులకు జీవనోపాధి కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, బాధ్యత పెంపొందించాలని స్పష్టం చేశారు. సూచించారు. జిల్లాలో ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో పర్యాటక శాఖ ఆర్‌డీఎఫ్ రమణ ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. ఒంటిపూట బడి



వసంతాబాయి, ఐసీడీఎస్ పీడీ

తిరుపతి అర్బన్ : అంగన్‌వాడీ స్కూళ్లను ఒంటిపూట నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ వసంతాబాయి ఆదేశించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మే 31 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని స్పష్టం చేశారు. వేసవి నేపథ్యంలో టీచర్లు, హెల్పర్లు అందుబాటులో ఉంటూ పిల్లలకు తాగునీటి వసతి కల్పించాలని సూచించారు.

25న ప్రసన్నుడి కల్యాణోత్సవం

తిరుపతి కల్చరల్ : అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 25వ తేదీన స్వామివారి కల్యాణమహోత్సవం నిర్వహించనున్నారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఉదంపతులు రూ.300లు చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

ఉచితం.. అడిగితే అనుచితం

కూటమి నేతల బూటకపు హామీలపై మహిళలకు మండిపడ్డారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో వంచించారని ఆరోపించారు. ఉచిత ప్రయాణమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు గుప్పించారని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుంటే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బుధవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కదంతొక్కారు. ఆర్టీసీ బస్సులో ఎక్కి చంద్రబాబు మాయమాటలను ఎండగడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అధికారం కోసం అతివలను దగా చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పోలీసుల దురుసు ప్రవర్తనపై ఆందోళనకు దిగారు.

సూపర్‌సిక్స్ మోసంపై వైఎస్సార్‌సీపీ వినూత్న నిరసన

- ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి మహిళల యత్నం
- నిర్ధాక్షిణ్యంగా లాగి పడేసిన పోలీసులు
- కేసులు నమోదు చేసి వేధింపులు



సీఎం చంద్రబాబు చెప్పినట్లు ఉచితంగానే ప్రయాణిస్తామంటున్న మహిళలు (చిత్రంలో) మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి



నినాదాలు చేస్తున్న అభినయ్, నేతలు

తిరుపతి మంగళం : ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ మహిళలు వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి వెంటనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బస్సులో ఎక్కి గతంలో చంద్రబాబు ఉపన్యాసాల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ కేవలం అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబుకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న ఆలోచన లేదా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమని చంద్రబాబు చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మహిళలు బస్సులో ఎక్కితే పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని, నిర్ధాక్షిణ్యంగా కిందకు లాగేశారని మండిపడ్డారు. ఆడబిడ్డలను దారుణంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం. ఉచిత బస్సు ప్రయాణమంటూ స్త్రీలను వంచించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ మహిళలపై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్ కడపగుంట అమరనాథరెడ్డి, కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, పునీతమ్మ, నేతలు ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, మద్దాలి శేఖర్, అనిల్‌రెడ్డి, వెంకటేష్‌రాయల్, ఇమ్రాన్‌బాషా, సోమశేఖర్‌రెడ్డి, పసుపులేటి సురేష్, మల్లం రవి, అరుణ్‌యాదవ్, గీతాయాదవ్, మధుబాల, పద్మజ, విజయలక్ష్మి, సాయికుమారి, దుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.



ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మహిళలను లాగేస్తున్న పోలీసులు

ఇదే చంద్రబాబు నైజం

వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇవ్వడం, అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబు నైజమన్నారు. బస్సులో ఉచిత ప్రయాణం అనగానే ఎంతో ఆశతో ఓట్లు వేసి గెలిపించిన మహిళలను ఇప్పుడు అదే బస్సు నుంచి కిందికి లాగి పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలు చేయలేని హామీలు ఎందుకు ఇవ్వాలని మండిపడ్డారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడమేనా పాలన అంటే అని ప్రశ్నించారు. జగనన్న ఐదేళ్ల పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా ఇచ్చిన హామీల కంటే ఎక్కువే అమలు చేశారని కొనియాడారు. సంక్షేమ పథకాల రూపంలో రూ. 3లక్షల కోట్లను పేదలకు అందించారని వెల్లడించారు.

హిందీ పరీక్షకు 272 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని మొత్తం 164 కేంద్రాల్లో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు హిందీ పరీక్ష నిర్వహించినట్లు డీఈఓ కేవీఎస్ కుమార్ తెలిపారు. మొత్తం 272 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

ఒంటిపూట తప్పదు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా ఒంటిపూటే బడులు నిర్వహించాల్సి ఉందని డీఈఓ స్పష్టం చేశారు. కొన్నిచోట్ల ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా వారు తీరుమార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు అన్ని ప్రైవేటు స్కూళ్లపై నిఘా పెడతామని తెలిపారు.

నేడు తిరుపతికి సీఎం రాక

తిరుపతి అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తిరుపతికి రానున్నారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి గురువారం రాత్రి 9.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన తిరుమలకు వెళతారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణం కానున్నారు.

ఆత్మ'గౌరవ'ం కోసమే సమ్మె



45వరోజు సమ్మెలో వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ : న్యాయమైన డిమాండ్‌లతో 45 రోజులుగా సమ్మె చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని వెటర్నరీ వర్సిటీ విద్యార్థులు మండిపడ్డారు. బుధవారం వారు మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసమే సమ్మెకు దిగినట్టు వెల్లడించారు. యూజీ విద్యార్థులకు రూ.10,500, పీజీ విద్యార్థులకు రూ.13,500, పీహెచ్‌డీ వారికి రూ.15వేలకు స్టయిఫండ్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడం తమకు సమ్మతం కాదన్నారు. వైద్యరంగంలోని అన్ని విభాగాల్లో విద్యార్థులతో సమానంగా గౌరవ వేతనం అందించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వెనక్కుతీసుకోవాలని కోరారు. లక్ష్యం నెరవేరే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని తెలిపారు.

ఆశనిపాతం!

అన్నదాతను ప్రభుత్వం చులకనగా చూస్తోంది. ఆరుగాలం కష్టించినా ఫలితం దక్కని దయనీయ పరిస్థితి తీసుకువచ్చింది. వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. ఈ క్రమంలోనే ఆశించిన దిగుబడి లేక రైతాంగం దిగాలు పడుతోంది. లాభాల సంగతి దేవుడెరుగు.. కనీసం పెట్టుబడి కూడా చేతికందక కొట్టుమిట్టాడుతోంది. సర్కారు శీతకన్ను వేయడంతో దిక్కుతోచక దళారుల చేతిలో దగా పడుతోంది. వ్యవసాయం దండగని ఒకప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేస్తే.. వరి మినహా మరొకటి సాగు చేయరు అంటూ ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా రైతులను మంత్రి అచ్చెన్నాయుడు ఎగతాళి చేశారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. - చిల్లకూరు



చిట్టమూరు మండలంలో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

- పంటలకు దక్కని గిట్టుబాటు
- పెట్టుబడి కూడా ప్రశ్నార్థకం
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో రైతాంగం



చిల్లకూరు మండలం బల్లవోలులో ఆరబెట్టిన వేరుశనగ

పంట	గత ఏడాది ధర	ప్రస్తుత ధర
వరి (పుట్టి- 850 కేజీలు)	రూ.23 వేలు	రూ.17వేలు
వేరుశనగ (పుట్టి- 460కేజీలు)	రూ.36 వేలు	రూ.26వేలు
నిమ్మ (కేజీ)	రూ.100	రూ.40
రొయ్యలు (100 కౌంట్)	రూ.260	రూ.210
మిర్చి (టన్ను)	రూ.30వేలు	రూ.15వేలు
పాలు (లీటర్)	రూ.70	రూ.60
పుచ్చ (కేజీ)	రూ.20	రూ.10

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



నేను ఎకరా పొలంలో మిర్చి సాగు చేశా. మొదట్లో ధరలు బాగా ఉండడంతో ఆదాయం బాగా వస్తుందని అనుకున్నా. దీంతో ఎకరాకు రూ.2లక్షల వరకు ఖర్చు చేశా. దిగుబడి వచ్చే సమయానికి మిర్చి ధరలు పతనావస్థకు చేరుకున్నాయి. గత ఏడాది టన్ను మిర్చి రూ.30వేల వరకు పలికింది. ప్రస్తుతం టన్ను రూ.15వేలు మాత్రమే ఉంది. ధరలు సగానికి పైగా పడిపోవడంతో ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. మార్కెట్‌లో మాత్రం మిర్చి ధర ఆకాశాన్నంటుతోంది. మాకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణం. - రమణయ్య, మిర్చి రైతు, తిన్నెలపూడి, కోట మండలం

రొయ్యల సాగు కష్టం



నేడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే వాడిని. గత ఏడాది ఉద్యోగం వదిలి సొంతంగా నా భూమితోపాటు కొంత కౌలుకు తీసుకుని రొయ్యలు సాగు చేపట్టా. తీరా పట్టుబడి వచ్చే సమయానికి రోజూ కౌంటు మీద రూ.10 తగ్గించేస్తున్నారు. దీని వల్ల రూ.లక్షల్లో నష్టం వచ్చింది. రొయ్యల సాగుకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఉన్న ధరలను కూడా అదుపు చేయలేకపోయింది. ఒక్క నెలలోనే కౌంటుకు రూ.50 వరకు తగ్గింది. ఈ పరిస్థితుల్లో రొయ్యల సాగు కష్టంగా మారింది. - సన్నారెడ్డి విజయులురెడ్డి, ఆక్వా రైతు, శింగనలత్తూరు, చిట్టమూరు మండలం

ఖర్చులు పెరిగిపోయాయి



నాకు ఏడు గేదెలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే పాలను ప్రైవేట్ డెయిరీకి విక్రయించి కుటుంబానికి అండగా ఉంటున్నా. గత ఏడాది వేసవిలో లీటరు పాలకు రూ.70 వరకు వచ్చేది. ఈ ఏడాది సరాసరి రూ.60లకు తగ్గించేశారు. వెన్నశాతం తగ్గిపోయిందని సాకులు చెప్పి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గేదెలకు పచ్చి మేత, ఎండుగడ్డి, దాణాల ఖర్చులు మాత్రం పెరిగిపోయాయి. వీటిని భరించడం కష్టంగా ఉంది. దీంతో చాలామంది పాడి రైతులు చేసేదిలేక గేదెలను అమ్మేస్తున్నారు. - మస్తానమ్మ, పాడి రైతు, చిట్టమూరు

ఫలితం లేదు



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో ఏటా పుచ్చ సాగు చేపడుతుంటా. ఈ ఏడాది కూడా ధరలు బాగా ఉంటాయని పుచ్చ సాగు చేశా. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి కింద ఖర్చు పెట్టా. దిగుబడి బాగానే వచ్చింది. కష్టాలు తీరిపోతాయిలే అనుకుంటే కాయలకు రేటు తగ్గిపోయింది. మార్కెట్‌లో కేజీ రూ.10లకు అడుగుతున్నారు. గత ఏడాది రూ.15 పలకడంతో ఆదాయం వచ్చింది. ఇప్పుడు కష్టమే మిగిలింది. ఫలితం లేకుండా పోయింది. - పోలిచెర్ల రమణమ్మ, పుచ్చరైతు, ఏరూరు, చిల్లకూరు మండలం

మద్దతు ధర లేదు



నేను సొంతంగా 4 ఎకరాలు, కౌలుకు 4 ఎకరాలను తీసుకుని వరి సాగు చేపట్టా. గత ఏడాది కూడా ఎకరాకు నాలుగు పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఎకరాకు 2.5 నుంచి 3 పుట్లు మాత్రమే వచ్చాయి. ధరలు లేక పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గత ఏడాది పుట్టి ధాన్యం రూ.24 వేల వరకు పలికింది. ఈ ఏడాది రూ.17 వేలకు పడిపోయింది. ప్రభుత్వం మద్దతు ధరలు కల్పించపోవడంతోనే దళారులు ఇలా రేట్లు తగ్గించేస్తున్నారు. - కోట్లపూడి శ్రీనివాసులు, వరి రైతు, కాశీపురం, వాకాడు మండలం

నష్టాలు తప్పడం లేదు



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నా. మామూలుగా ఎకరాకు మూడు పుట్ల వేరుశనగ దిగుబడి వస్తుంది. గత నాలుగేళ్లుగా ధరలు బాగా ఉండడంతో ఆదాయం వచ్చింది. ఈ ఏడాది దిగుబడి బాగానే వచ్చినప్పటికి ధరలు తగ్గిపోవడంతో నష్టాలు తప్పడం లేదు. గతంలో పుట్టి వేరుశనగ రూ.36 వేల నుంచి రూ.38 వేల వరకు పలికేది. ఈ ఏడాది రూ.28 వేల నుంచి రూ.30 వేలకు పడిపోయింది. - ఆదిశేషయ్య, వేరుశనగ రైతు, పునుగుంటపాళెం, చిల్లకూరు మండలం

భూముల రీసర్వే తనిఖీ



మాట్లాడుతున్న ఏడీ గోవిందరావు

తిరుపతి రూరల్: మండలంలోని సి.గొల్లపల్లె వద్ద నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను ఏపీ సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. గోవిందరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల సహకారం, కొత్తగా తయారు చేసిన సర్వే రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సి.గొల్లపల్లి రెవెన్యూ లెక్క దాఖలాలో ఎంత మేరకు భూముల రీసర్వే పూర్తి చేశారు, రైతులు నుంచి వస్తున్న సలహాలను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్‌తో పాటు తహసీల్దార్ రామాంజులు నాయక్ పాల్గొన్నారు.

యువత.. ఇదిగో భవిత!





- విద్యార్థులకు వరం.. పీఎం ఇంటర్న్‌షిప్
- నెలకు రూ.5వేల స్టయిఫండ్‌తో ఏడాదిపాటు శిక్షణ
- దరఖాస్తుకు ఈనెల 31 తుది గడువు
- జిల్లాలో లక్ష మందికి అవకాశం

తిరుపతి సిటీ : చంద్రబాబు సర్కార్ యువతను నట్టేట ముంచింది. నిరుద్యోగ భృతి లేదు.. జాబ్ క్యాలెండర్ మాటే మరిచింది.. ఏడాదిగా ఉద్యోగాల ఊసేలేదు. దీంతో ఏ చిన్న అవకాశం వచ్చినా యువత ఉపయోగించుకునేందుకు ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో ఉపాధి కల్పనే లక్ష్యంగా యూజీ పట్టభద్రులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అందులో భాగంగా ‘పీఎం ఇంటర్న్‌షిప్–2025’ ప్రవేశ పెట్టింది. సాంప్రదాయ కోర్సులలో డిగ్రీ పూర్తి చేసిన నిరుపేద అభ్యర్థులకు ఇండస్ట్రియల్ ఫీల్డ్‌లో ఇంటర్న్‌షిప్ కింద శిక్షణ అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు ఈ నెల 31వ తేదీలోపు pminternship.mca.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. ఈ క్రమంలోనే జిల్లావ్యాప్తంగా ఈ పథకానికి దాదాపు లక్ష మందికి అర్హత ఉన్నట్లు గుర్తించింది.

పకడ్బందీ శిక్షణ

పీఎం ఇంటర్న్‌షిప్ పథకంలో విద్యార్థులకు ఏడాది పాటు పరిశ్రమలలో పకడ్బందీ శిక్షణ అందించనున్నారు. ఈ సమయంలో ప్రతి నెలా రూ.5వేల స్టయిఫండ్‌ను నేరుగా అభ్యర్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తారు. ఉపాధి, ఉద్యోగాలకు సంబంధించిన ఇంటర్వ్యూల సమయంలో ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ ఉపయోకరంగా ఉంటుంది.

పథకానికి అర్హతలు ఇవీ..

- ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తి చేయడం
- బీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణత
- గుర్తింపు పొందిన వర్సిటీలు, విద్యాసంస్థల నుంచి రెగ్యులర్ కోర్సులు పూర్తి చేసి ఉండాలి
- 21 ఏళ్ల నుంచి 24 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలి.

క్లుప్తంగా

సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన


కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు బుధవారం సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యత, పరిశోధన కోసం ఫెలోషిప్స్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పీవీ నరసయ్య మాట్లాడుతూ స్కిల్స్ డెవలప్‌మెంట్, పరిశోధనలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళీధర్, డాక్టర్ కళ్యాణ్ కుమార్, డాక్టర్ వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ వర్క్‌షాపు

తిరుపతి సిటీ: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో అద్వైత వేదాంత విభాగం ఆధ్వర్యంలో శ్రీహర్ష ఖండన ఖండ ఖాద్య గ్రంథ అధ్యయనంపై 10 రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో పాత గురుకుల శైలిలో బోధన, చింతనం, అనువాదం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ప్రత్యేక అతిథి ఆచార్య మణి ద్రావిడ శాస్త్రి, అధ్యాపకులు మాట్లాడారు.

ఇంటర్న్‌షిప్ కోసం అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలతో ప్రిన్సిపాల్ సత్యనారాయణ

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం విద్యార్థుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ కోసం జగతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జగతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.వాసుదేవ నాయుడు, బి.సులోచన రాణి, పి.చంద్రయ్య, సృజన పాల్గొని ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

ప్రాపర్టీ రైట్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎం.ఉషా రాణి, కె.చందనశ్రీ ఆధ్వర్యంలో బుధవారం ప్రొటెక్టింగ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ ఐపీ మేనేజ్‌మెంట్ ఫర్ స్టార్టప్స్‌పై సెమినార్ నిర్వహించారు. ఇందులో రిసోర్స్‌పర్సన్‌గా విక్రమ సింహపురి వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కోటా నీలమణికంఠ పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రాపర్టీ రైట్స్, ట్రేడ్ మార్క్స్, పేటెంట్స్ అండ్ పబ్లికేషన్స్ అనే అంశాలపై అవగాహన కల్పించారు.

వేట మొదలైంది!

- డిప్యూటీ మేయర్ ఎన్నికలో హింసపై విచారణ
- 14 మంది కూటమి నేతలకు నోటీసులు
- నిందితులను త్వరలో అరెస్ట్ చేసే అవకాశం?



తిరుపతి తుడా : తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో జరిగిన హింస, కిడ్నాప్ వ్యవహారంలో విచారణ మొదలైంది. ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి ఫిర్యాదు మేరకు ఈ ఘటనలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈమేరకు నివేదికను మూడు రోజుల్లో సమర్పించాలని డీజీపీకి స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో బుధవారం విచారణ ప్రారంభించారు. ముందుగా అల్లర్లలో పాల్గొన్న 14 మంది టీడీపీ, జనసేన నేతలకు నోటీసులు జారీ చేశారు. దీంతో నాడు అల్లర్లకు పాల్పడిన కూటమి నేతల్లో ఆందోళన మొదలైంది.

అల్లరిమూకలపై చర్యలు!

డిప్యూటీ మేయర్ ఎన్నికను కూటమి నేతలు అపహాస్యం చేశారు. అధికారం అండతో అరాచకం సృష్టించారు. మహిళా కార్పొరేటర్లను కూడా బండ బూతులు తిట్టి పైశాచికానందం పొందారు. దళిత ఎంపీ గురుమూర్తితో దురుసుగా ప్రవర్తించారు. ఆయన ఓటు హక్కును వినియోగించుకోకుండా అడుగడుగునా అడ్డుపడ్డారు. దీనిపై ఎంపీ తీవ్రంగా స్పందించారు. మానవ హక్కుల ఉల్లంఘన, దళిత ప్రజా ప్రతినిధుల హక్కులకు భంగం కలిగించడం వంటి అంశాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్, కేంద్ర హోం శాఖ, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అన్ని పక్కల నుంచి కూటమి నేతల హింసాత్మక ధోరణి విచారణ మొదలైంది. దాడులు, కిడ్నాప్‌లకు పాల్పడిన వారిపై ఉచ్చు బిగుస్తోంది. ఈ క్రమంలోనే అల్లరి మూకలను స్పష్టంగా గుర్తించేలా వైఎస్సార్‌సీపీ సైతం ఆధారాలను సేకరించింది. దీంతో నిందితులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకునే అవకాశం లేదని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విచారణ అనంతరం అల్లరి మూకలను అరెస్టు చేయనున్నట్లు తెలుస్తోంది.

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నేతలు వ్యవహరించిన తీరుపై జాతీయ మహిళా కమిషన్‌కు మహిళా కార్పొరేటర్లు ఫిర్యాదు చేయనున్నారు. ఈ మేరకు న్యాయ నిపుణులను సంప్రదించారు. ఓటు వేసేందుకు వస్తున్న క్రమంలో తమతో కొంతమంది అసభ్యంగా ప్రవర్తించారని, బూతులు తిట్టారని వెల్లడిస్తున్నారు. నగర మేయర్‌తో కూడా దురుసుగా ప్రవర్తించారని వివరిస్తున్నారు. ''ఏయ్ మేయర్నే ఎత్తుకెళ్లిపోతే సరిపోదా'' అంటూ కేకలు వేశారని ప్రస్తావిస్తున్నారు.

విచారణ నిష్పక్షపాతంగా ఉండాలి

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో హింస, కిడ్నాప్ వ్యవహారానికి సంబంధించి అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఎంపీ గురుమూర్తి తెలిపారు. నాడు విధుల్లో ఉన్న పోలీసు అధికారుల జాబితాతో పాటు అల్లరిమూకల హింస ఘటనలకు సంబంధించి వీడియోలు, ఫొటోలు, పేపర్ క్లిప్పింగులను ఇప్పటికే కేంద్ర హోంశాఖ, మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు వెల్లడించారు. ఎఈ విచారణలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి తీరాల్సిందే అని స్పష్టం చేశారు. ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను గుర్తించాలన్నారు. ఆ ప్రకారం సమగ్ర నివేదికను అందించాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉందని తెలిపారు. విచారణలో పక్షపాతం చూపితే చట్టపరంగా మరింత ముందుకు వెళతామని హెచ్చరించారు. అవసరమైతే సీబీఐ ఎంక్వైరీ కోరేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

కార్పొరేటర్లకు బెదిరింపులు

విచారణ ప్రక్రియ మొదలవడంతో కొంతమంది టీడీపీ, జనసేన నేతలు కార్పొరేటర్లపై బెదిరింపులకు దిగినట్లు సమాచారం. తమపై దాడి చేయలేదని, తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని విచారణలో చెప్పాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. తమకు అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు ఓ కార్పొరేటర్ మీడియాకు తెలిపారు. మీ భవనాలను కూల్చేస్తాం, భవిష్యత్తులో కేసులు పెడతామంటూ హెచ్చరించడాన్ని వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

తవ్వేస్తూ.. తరలిస్తూ!


ఇసుక అక్రమ రవాణాకు సిద్ధంగా ట్రాక్టర్లు


దుర్గసముద్రం-అడపారెడ్డి మధ్య స్వర్ణముఖి నదిలో ఇసుకను తోడేస్తున్న అక్రమార్కులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- టీడీపీ నేతల అండతో అక్రమార్కుల దందా

తిరుపతి రూరల్: మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. తవ్వుకున్నోళ్లకు.. తవ్వుకున్నంత అన్నట్టు యథేచ్ఛగా సాగుతోంది. ప్రధానంగా స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ..తరలిస్తున్నారు. రాత్రీ, పగలు తేడా లేకుండా ట్రాక్టర్‌లు, లారీలు, టిప్పర్‌లతో చెన్నై, బెంగుళూరుకు రవాణా చేసి రూ.కోట్లు గడిస్తున్నారు. టీడీపీ నేతల అండతోనే ఇసుకాసురులు రెచ్చిపోతున్నారని స్థానికులు, తెలుగు తమ్ముళ్లు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

నిత్యం వందల టన్నులు

ప్రధానంగా దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి, చిగురువాడ, కేసీపేట, తణపల్లి, కుంట్రపాకం, తిరుచానూరు ప్రాంతాల్లో స్వర్ణముఖి నదిని యధేచ్ఛగా తవ్వేస్తున్నారు. నిత్యం వందల టన్నుల ఇసుకను సరిహద్దులు దాటించేస్తున్నారు. అక్రమార్కుల ఆగడాలతో రాత్రి వేళ పొలం వద్దకు వెళ్లేందుకు సైతం రైతుల వణికిపోతున్నారు. నదిలో యంత్రాల సాయంతో లోతుగా తవ్వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

స్వర్ణముఖిలో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమార్కులకు సహకారం అందిస్తున్నారని విమర్శిస్తున్నారు. సాక్షాత్తు ఆర్‌డీఓ ఆదేశాలు జారీ చేసినా బేఖాతర్ చేస్తున్నారని మండిపడుతున్నారు.

నేడు సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవం


మాట్లాడుతున్న జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ

తిరుపతి సిటీ : తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో గురువారం జాతీయ సంస్కృత వర్సిటీ నాలుగో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా జాతీయ సంస్కృత వర్సిటీ పని చేస్తోందన్నారు. స్నాతకోత్సవంలో ఆచార్య ఎంఏ, ఎమ్మెస్సీ, బీఏ, బీఎస్సీ, యోగాథెరపిలో 546 మంది విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే 75 మందికి పీహెచ్‌డీ, 42 మందికి బంగారు పతకాలు ప్రదానం చేయనున్నట్టు వివరించారు. సంస్కృత భాషను నేర్పించేందుకు బాల వికాస కేంద్రాలు ఏర్పాటు చేసి 2,242 మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను అందించనున్నట్టు తెలిపారు. స్నాతకోత్సవానికి మాజీ చాన్సలర్, ఆర్థిక వేత్త, పద్మశ్రీ డాక్టర్ వీఆర్ పంచముఖి, ఎన్ఎస్‌యూ చాన్సలర్ పద్మభూషణ్ గోపాల స్వామి హాజరవుతారని తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సాంబశివమూర్తి, ఓఎస్‌డీ రఘునందన్, పీఆర్ఓ ప్రొఫెసర్ రమేష్, ఏపీఆర్‌ఓలు డాక్టర్ కే కుమార్, బల్దీదాస్, డాక్టర్ నందనరావు పాల్గొన్నారు.

క్రికెట్ టీ20 విజేత పోలీసు జట్టు


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి సిటీ : తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో ఈ నెల 8వ తేదీ నుంచి బుధవారం వరకు నిర్వహించిన మెగా కార్పొరేట్ క్రికెట్ టీ 20 లీగ్ 2025 ముగిసింది. కలెక్టర్‌వెంకటేశ్వర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతగా నిలిచిన పోలీసు జట్టుకు ట్రోఫీ బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్‌తో పాటుగా వాలీబాల్ వంటి టోర్నమెంటులు నిర్వహించాలని నిర్వాహకుడు చీర్ల కిరణ్‌కు సూచించారు.

టీటీడీ ఉద్యోగిపై చీటింగ్ కేసు

తిరుమల : చెన్నై శ్రీవారి ఆలయంలోని పరకామణిలో విదేశీ కరెన్సీ నోట్లను తారుమారుచేసిన టీటీడీ ఉద్యోగి కృష్ణకుమార్‌పై తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ చలపతి తెలిపిన వివరాల మేరకు.. ప్రస్తుతం తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన కృష్ణ మోహన్ గత ఏడాది చెన్నై శ్రీవారి ఆలయంలో విధులు నిర్వర్తించే సమయంలో విదేశీ కరెన్సీని పక్కదోవ పట్టించారు. ఈ మేరకు అవకతవకలను అధికారులు గుర్తించారు. దాదాపు రూ.7లక్షల వరకు కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పాల్పడినట్లు విజిలెన్స్ నివేదికలో వెల్లడించారు.నీ మేరకు నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

ముగిసిన వేద సమ్మేళనం


అతిథులను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీ, మహర్షి సాందీపని వేద విజ్ఞాన ప్రతిష్ఠాన్ ఉజ్జయినీ సంయుక్తంగా మూడు రోజులుగా వర్సిటీలో నిర్వహిస్తున్న వేద సమ్మేళనం బుధవారం ముగిసింది. వేద సమ్మేళనానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి వేద పండితులు 100 మందికి పైగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా కంచి శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి మహా విశ్వవిద్యాలయం కులపతులు జీ. శ్రీనివాస శర్మ, సాందీపని వేద విజ్ఞాన పీఠం సచివులు డాక్టర్ విరూపాక్ష జెడ్డిపాల్ ప్రసంగించారు. వేదాలు భారతీయ సంస్కృతికి మూలాలని, వాటిని కాపాడుకోవడానికి సాంకేతిక విద్యను అభ్యసించాలన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 11,000 విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారని, ఈ సంఖ్యను 1,11,000 పెంచి వేద పండితులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకుపోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వర్సిటీ అధికారులు అతిథులను సత్కరించారు. సమ్మేళనంలో వీసీ రాణి సదాశివమూర్తి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి భాస్కరుడు, సంచాలకులు డాక్టర్ తారకరామశర్మ, డీన్ సుబ్రమణ్యశర్మ, గణేష్ భట్, పురుషోత్తమాచార్యులు, ఆచార్య రాఘవన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు డిజిటల్ భద్రతపై వర్క్‌షాపు


డిజిటల్ భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు సాంకేతికత, డిజిటల్ భద్రతలో రక్షణ, నివారణ చర్యలు అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అధ్యక్షురాలు ఆచార్య సుధారాణి మాట్లాడుతూ సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళలు యాప్‌ల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కెమెరాలున్న సాంకేతిక వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య సాయి సుజాత, విద్యార్థినులు, మహిళా పరిశోధకులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ


షాపును పరిశీలిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ

చంద్రగిరి : స్థానిక బజారువీధిలో కసాయి మార్కెట్ వద్ద కూరగాయల దుకాణంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. పాతపేటకు చెందిన అనసూయ అనే మహిళ కొన్నేళ్లుగా కూరగాయల దుకాణం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో దుండగులు షాపులో దాచిన రూ.లక్ష నగదు, 48 గ్రాముల బంగారు నెక్లెస్‌తోపాటు 50 కేజీల తెల్లగడ్డలు, తూకం కాటాలు, 10 కిలోల ఎండు మిర్చి, 100 కిలోల బంగాళాదుంపలను దోచుకెళ్లినట్లు బాధితురాలు వెల్లడించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.పోలీసులు ఘటనాస్థలం పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరుకు చెన్నై బృందం


కండలేరు హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాపూరు : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కండలేరు జలాశయాన్ని చెన్నై మెట్రో వాటర్ బృందం బుధవారం సందర్శించింది. ఈ మేరకు అధికారులతో సమావేశం నిర్వహించింది. చెన్నై నగరవాసుల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాలను ఏప్రిల్ నుంచి విడుదల చేయాలని కోరింది. సమావేశంలో ఎస్ఈ రాధాకృష్ణారెడ్డి, చెన్నై మెట్రో వాటర్ సీఈ జానకి, ఎస్సీ మహేష్ నాగార్జున్, ఈఈ తిలైకరాసి, ఏఈలు రాజా, భరత్, తెలుగుగంగ ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య, అనిల్, శ్రీనివాసరావు, అనిల్‌బాబు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మాధవన్ (ఫైల్)

చంద్రగిరి : మండలంలోని తొండవాడ పంచాయతీ జగనన్న కాలనీలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు. మాధవన్(23) కొద్ది రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేశాడు. బెడ్‌రూంలో నిద్రిస్తున్న మాధవన్‌కు ఒక్కసారిగా కడుపు నొప్పి తీవ్రం కావడంతో అర్ధరాత్రి సమయంలో ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఈ మేరకు అలికిడి కావడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మాధవన్ వేలాడుతున్నాడు.. హుటాహుటిన చంద్రగిరిఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల పాప ఉంది.

మృత్యువుతో పోరాడి ఓడిన అంగన్‌వాడీ కార్యకర్త

- ఈనెల 10న విజయవాడలో శ్రీవాణికి బ్రెయిన్ స్ట్రోక్
- చికిత్స పొందుతూ బుధవారం మృతి


శ్రీవాణి (ఫైల్)

నాగలాపురం: పిచ్చాటూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త శ్రీవాణి మృత్యువుతో పోరాడి చివరకు ఓడిపోయింది. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆమె బుధవారం ఆమె కన్నుమూశారు. వివరాలు.. ఈ నెల 10 వ తేదీ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిమిత్తం పిచ్చాటూరుకు చెందిన శ్రీవాణి విజయవాడకు వెళ్లారు. అక్కడ కార్యకర్తలు ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వెళుతుండగా ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రి పాలయ్యారు. కొన్నాళ్లు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. తర్వాత తిరుపతి స్విమ్స్‌కు తరలించి వెంటిలేటర్‌పై చికిత్స పదిరోజులుగా శ్రీవాణి శరీరం చికిత్సకు స్పందించకపోవడంతో ఆమె మరణించినట్లు బుధవారం మధ్యాహ్నం డాక్టర్లు ప్రకటించారు. ఆమె మృతికి సహచర అంగన్‌వాడీ కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. ఆమెకు ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గేట్‌లో ఎస్వీయూ విద్యార్థినికి 78వ ర్యాంకు


ర్యాంక్ సాధించిన బి.కీర్తి

తిరుపతి సిటీ : దేశ వ్యాప్తంగా బుధవారం విడుదల చేసిన గేట్ ఫలితాల్లో ఎస్వీయూ ఫిజిక్స్ విభాగానికి చెందిన పీజీ విద్యార్థిని బి.కీర్తి జాతీయ స్థాయిలో 78వ ర్యాంక్ సాధించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆమె వర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో ఫొటానిక్స్ ప్రత్యేక అంశంగా అధ్యయనం చేశారు. ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. గేట్ పరీక్షల్లో ర్యాంకు పొందడం ద్వారా జాతీయ స్థాయి యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసే అవకాశం దక్కింది. ఆమె అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

స్థూల ఆర్థిక విశ్లేషణపై అవగాహన సదస్సు


సదస్సుకు హాజరైన అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం, న్యాయశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో బుధవారం నిత్య జీవితంలో స్థూల ఆర్థిక విశ్లేషణ సూచికలు, ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. హరిసింగ్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట మునిరెడ్డి (మధ్యప్రదేశ్) ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో స్థూల ఆర్థిక సూచికలైన స్థూల జాతీయోత్పత్తి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, వడ్డీ రేటు, గత ఐదేళ్లలో చోటుచేసుకున్న మార్పులను విశ్లేషించారు. అలాగే వినియోగదారుల విశ్వాస సూచిక, మాన్యుఫ్యాక్చరింగ్ సూచికను ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంబీయూ వార్షికోత్సవం


మహా భారతం సీరియల్ నటులను సత్కరిస్తున్న మోహన్ బాబు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

చంద్రగిరి : శ్రీసాయినాథనగర్‌లోని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) 33వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సినీ నటులు శరత్‌కుమార్, ప్రభుదేవా హాజరయ్యారు. నాగఫణిశర్మ మాట్లాడుతూ ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయం నెలకొల్పడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. రాయలసీమలో ఇంత గొప్ప విద్యాలయం నిర్వహిస్తున్న మోహన్‌బాబు ఆదర్శనీయులని కొనియాడారు. కారుమూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ మోహన్‌బాబు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. ఈ క్రమంలోనే తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత యువతకు ఉందని పిలుపునిచ్చారు. శరత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ వర్సిటీగా ఎంబీయూ నిలుస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులను మోహన్‌బాబు చేతులమీదుగా ఘనంగా సత్కరించారు.

అందరి వాడిని : మోహన్‌బాబు

కులపతి అంటే ఏ కులానికి అధిపతి అని అనుకునే పరిస్థితి నేడు ఉందని మోహన్ బాబు తెలిపారు. తాను ఏ కులానికి చెందిన వాడిన కానని, అందరి వాడినంటూ వెల్లడించారు. అన్ని పార్టీలు నాకు కావాల్సినవే అని వివరించారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు.తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టిన వారు ఎవరూ ఉన్నతస్థాయికి వెళ్లలేరని తెలిపారు. మైఖేల్ జాక్సన్ తర్వాత ప్రపంచంలోనే ఉత్తమ డ్యాన్సర్ ప్రభుదేవా అని ప్రశంసించారు. అనంతరం స్టేజీపైకి వచ్చిన ప్రభుదేవాతో కలసి డ్యాన్స్ చేస్తూ విద్యార్థులను ఉత్సాహపరిచారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: హత్య కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల, ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు జడ్జి అర్చన బుధవారం తీర్పు చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... చంద్రగిరి మండలం, చిన్న రామాపురం హరిజనవాడకు చెందిన గండికోట దేవరాజులు, గండికోట శ్రీనివాసులు ఇంటి వెనక గండ్లపల్లి వెంకటయ్య కుటుంబం నివసించేది. ఇంటి ప్రహరీ గోడ విషయమై రెండు కుటుంబాల మధ్య తరచూ తగువులు జరుగుతూ ఉండేవి. 2018 జూన్ 7వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో నిందితులు దేవరాజులు, శ్రీనివాసులు కలిసి వెంకటయ్య కుటుంబ సభ్యులపై ఇటుకరాళ్లతో దాడి చేశారు. కులం పేరుతో దూషించారు. ఈ దాడిలో వెంకటయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటయ్య భార్య సుబ్బరత్నం చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితులు దేవరాజులు, శ్రీనివాసులు ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రసాద్ వాదించారు.